
సాక్షి
కాకినాడ

బుధవారం । 1 । మే । 2024



కోళ్లుకోవాలంటే..

వేసవి ఎండల ప్రభావం కోళ్ల పరిశ్రమపై చాలా ఎక్కువగా చూపుతోంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కోళ్లు చనిపోయే ప్రమాదం ఉంది. దీని నుంచి కోలుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలి. 8లో



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 1,000, మధ్య డెల్టాకు 800, పశ్చిమ డెల్టాకు 3,350 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
42.0° / 25.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	42.0	25.0
కాకినాడ	40.1	26.6
అమలాపురం	40.0	26.0

న్యూస్‌రీల్

నేడు ఓటరు చైతన్య గీతం ఆవిష్కరణ

కాకినాడ సిటీ: సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఓటరు చైతన్య గీతం ఆవిష్కరిస్తున్నట్లు జిల్లా నోడల్ అధికారి పి.విజయ్ భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటు హక్కు వినియోగంపై ఓటర్లలో చైతన్యం, అవగాహన కలిగించేందుకు సాయంత్రం 4 గంటలకు స్థానిక వివేకానంద పార్కు పక్కన ఉన్న రాజా ట్యాంకులోని కన్వెన్షన్ హాలులో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. ఇందులో భాగంగా జిల్లా స్వీప్ అంబాసిడర్‌గా నియమితులైన ప్రసిద్ధ గాయకుడు, జీ–సరిగప విజేత యశస్వి కొండేపూడి రూపొందించిన ఓటరు చైతన్య గీతాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ ఇతర ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరిస్తామని తెలిపారు. అనంతరం యశస్వి ఆధ్వర్యాన ప్రత్యేక సంగీత విభావరి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా, నగర ప్రజలు హాజరై జయప్రదం చేయాలని విజయ్ భాస్కర్ కోరారు.

ప్రైవేటు స్కూళ్లకు 1,793 మంది ఎంపిక

బాలాజీ చెరువు (కాకినాడ సిటీ): జిల్లాలోని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశానికి మొదటి విడతగా 1,793 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం లాటరీలో ఈ ఎంపిక జరిగిందన్నారు. నిబంధనల ప్రకారం ఎంపిక చేసిన విద్యార్థులకు 3 కిలోమీటర్ల పరిధిలోని పాఠశాలలను గుర్తించి, సీట్లు కేటాయించామని తెలిపారు. ఎంపికైన వారిలో 697 మంది ఎస్సీ, 22 మంది ఎస్టీ, 636 మంది బీసీ, 27 మంది మైనార్టీ, 411 మంది ఓసీ విద్యార్థులు ఉన్నారని వివరించారు. ఎంపికైన చిన్నారుల తల్లిదండ్రులు/సంరక్షకుల మొబైల్ నంబర్లకు సమాచారం పంపించామని తెలిపారు. అలాగే, ఎంఈఓలకు కూడా ఈ జాబితా పంపించామన్నారు. ఎంపికైన చిన్నారులు మే 10వ తేదీలోగా సంబంధిత ప్రైవేటు పాఠశాలల్లో చేరాలని, నూరు శాతం అడ్మిషన్లు పూర్తి చేసే విధంగా ఎంఈఓలు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ చిన్నారులు ఆయా పాఠశాలల్లో చేరారని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే మిగిలిన సీట్లకు రెండో విడత లాటరీ ప్రక్రియ మొదలవుతుందని రమేష్ స్పష్టం చేశారు.

జిల్లాలో 517 మంది సూక్ష్మ పరిశీలకులు

కలెక్టర్ హిమాన్షు శుక్లా



సమావేశంలో ఎన్నికల పరిశీలకులు పరదీప్ కుమార్‌తో కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 517 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియ సాధారణ ఎన్నికల పరిశీలకులు పరదీప్‌కుమార్ సమక్షంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా నిర్వహించి అసెంబ్లీ నియోజకవర్గాలకు కేటాయింపులు జరిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఓఎన్జీసీ, గెయిల్, పోస్టల్, ఎల్ఐసీ, బ్యాంకులకు చెందిన ఉద్యోగులను సూక్ష్మ పరిశీలకులుగా నియమించి సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వీరిని నియమించామన్నారు.

రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 47 పోలింగ్ కేంద్రాలు, ముమ్మిడివరంలో 56, అమలాపురం నియోజకవర్గంలో 84, రాజోలు నియోజకవర్గంలో 68, పి. గన్నవరం అసెంబ్లీ నియోజవర్గంలో 52, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గంలో 100, మండపేట అసెంబ్లీ నియోజకవర్గంలో 60 పోలింగ్ కేంద్రాలలో సూక్ష్మ పరిశీలకులను నియమించామన్నారు. వీరికి అదనంగా 10 శాతం సూక్ష్మ పరిశీలకులను రిజర్వులో ఉంచామన్నారు. ఒకే లొకేషన్‌లో రెండు మూడు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటికి సంబంధించి ఒక సూక్ష్మ పరిశీలకుడిని మాత్రమే నియమించామని ఆయన స్పష్టం చేశారు. వీరు మూడు కేంద్రాలలో పోలింగ్ సరళిని నిశితంగా పరిశీలన చేస్తూ నిష్పక్షపాతంగా పోలింగ్ నిర్వహించి నివేదికలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ పరిపాలనాధికారి సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, సెక్షన్ సూపరింటెండెంట్లు పి.సుబ్రహ్మణ్యం, టీ.వైద్యనాథ్ శర్మ పాల్గొన్నారు.

మాట నిలుపుకొన్నారు

ఆర్టీసీ కార్మికుల సమస్యలకు సీఎం జగన్ శాశ్వత పరిష్కారం చూపారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి మాట నిలుపుకొన్నారు. కరోనా సమయంలో బస్సులు తిరగకున్నా జీతాలు అందించి, ఎక్కడా ఇబ్బంది రాకుండా చూశారు. కార్మికుల మేలు కోరిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే.

– ఆర్టీసీ డ్రైవర్

జగనన్నతోనే సంతోషం

ఆర్టీసీ ఉద్యోగులుగా ఉన్నప్పుడు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు, అలవెన్సులు అందుతున్నాయి. ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామకాలు ఠంఛన్‌గా జరుగుతున్నాయి. జగనన్న చేసిన మేలును ఆర్టీసీ ఉద్యోగులు ఎప్పటికీ మరిచిపోరు. మా కుటుంబాలన్నీ ఈ రోజు సంతోషంగా ఉన్నాయంటే ఆయన చలువే.

– ఆర్టీసీ కండక్టర్

ఆహా ర్టీసీ

- సీఎం జగన్ సారథ్యంలో సంస్థకు వెలుగు రేఖలు
- ప్రభుత్వంలో విలీనంతో ఉద్యోగులకు మేలు
- 1,034 మంది జీవితాల్లో ఆనందోత్సాహాలు
- నాడు టీడీపీ హయాంలో ఆర్టీసీ నిర్వీర్యం
- జీతాలకూ ఎదురుచూసే గడ్డు పరిస్థితి



కాకినాడ డిపోలో ఆర్టీసీ బస్సులు

కాకినాడ సిటీ: 'ఆర్టీసీ ప్రయాణం సురక్షితం.. సుఖవంతం'.. ఈ స్లోగన్ ఆ సంస్థ బస్సుల్లో కనిపిస్తుంటుంది. ఇది నిజమే అయినా ఆ సంస్థకు కీలకమైన ఉద్యోగులకు గత టీడీపీ ప్రభుత్వంలో భద్రత లేకుండా పోయింది.. అందరితో సమానంగా పని చేస్తున్నా తమను ప్రభుత్వరంగ ఉద్యోగులుగా గుర్తించడం లేదనే భావన ఉండేది.. ఆర్టీసీ అంటే చిన్నచూపు వెంటాడేది.. అరకొర జీతాలైనా ఎప్పుడు అందుతాయో తెలియని పరిస్థితి నెలకొనేది.. కొత్త బస్సులు కొనాలన్నా ఆ విషయాన్ని ప్రభుత్వం పక్కనపెట్టేది. మరమ్మతులకు గురైన డొక్కు బస్సులనే ప్రగతి రథాలంటూ నడిపించేది. ఇన్ని ఒడుదొడుకుల మధ్య ప్రయాణికులను సురక్షితంగా చేర్చడం డ్రైవర్లకు ప్రాణసంకటం అయ్యేది. ఈ పరిస్థితుల నడుమ ప్రభుత్వం మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020 జనవరి 1న ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి చరిత్రను తిరగరాశారు. ఎవరూ చేయలేని సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. ఇలా ప్రజా రవాణా శాఖ ఉద్యోగుల జీవితాలకు కొండంత వెలుగులు తెచ్చాయి. ప్రభుత్వంలో ఆ సంస్థ విలీనం కావడంతో ఉద్యోగుల కష్టాలు తీరాయి. నాలుగేళ్లుగా వారికి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు, బెనిఫిట్స్, అలవెన్స్‌లు ఠంఛన్‌గా అందుతున్నాయి. ఇలా కాకినాడ జిల్లాలో 1,034 మంది ఉద్యోగుల కుటుంబాలకు సంతోషాలు వచ్చాయి.

నాడు..

టీడీపీ హయాంలో ఆర్టీసీ సంస్థ అప్పుల ఊబిలో ఉండేది. కొత్త బస్సుల మాటే ఎక్కడా ఉండేది కాదు. డొక్కు బస్సుల్లోనే టిక్కు టిక్కుమంటూ ప్రయాణించాల్సి వచ్చేది. బస్సు ఎప్పుడు, ఎక్కడ ఆగుతుందో తెలిసేది కాదు. ఆగితే ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు ఉండేవి. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం నుంచి రూపాయి సాయం కూడా అందేది కాదు. ఆర్టీసీ ఓ కార్పొరేషన్ సంస్థగా మనుగడ కష్టమైంది. ఉద్యోగులకు జీతాలూ అందేవి కావు. సమ్మె చేస్తే జీతాల్లో కోత, సమస్యల కోసం ఆందోనలు చేస్తే మెమోలు ఉండేవి. పనిభారం ఎక్కువగా ఉన్నా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు అందేవి కావు.

నేడు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసింది. ఈ సాహసోపేత నిర్ణయంతో ప్రభుత్వ ఉద్యోగులుగా వీరందరికీ గుర్తింపు లభించింది. ఉద్యోగ భద్రత కలిగింది. కొత్త బస్సులూ సమకూరాయి. కారుణ్య నియామకాల్లో ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు ఉపాధి లభించింది. ఎన్నో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమయ్యాయి. జీతాలు ఒక్కసారిగా రెట్టింపయ్యాయి. ఉద్యోగుల కుటుంబాలకు కొత్త వెలుగులు వచ్చాయి. సరికొత్త విధానాలతో ఆర్టీసీ ప్రగతి పథంలో దూసుకుపోతోంది.

నెరవేరిన చిరకాల స్వప్నం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల చిరకాల స్వప్నం నెరవేరనుంది. హయ్యర్ పెన్షన్ స్కీమ్‌తో ఉద్యోగులందరికీ లబ్ధి కలగనుంది. గతంలో కేవలం బేసిక్ రూ. 15 వేలు ఉన్న ఉద్యోగులే పెన్షన్‌కు అర్హులయ్యేవారు. ఇప్పుడు అందరికీ మేలు జరిగేలా ఆన్‌లైన్‌లోనే ఎంప్లాయీస్ పెన్షన్ ఫండ్ ఆర్గనైజేషన్ వివరాలను అప్లోడ్ చేసే వ్యవస్థను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. దీనికి 2014 సెప్టెంబర్ 1 నాటికి ఆర్టీసీ ఉద్యోగిగా విధుల్లో చేరిన డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ మెకానికర్లు, సెక్యూరిటీ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది అర్హులు. ఇప్పటికే ఉద్యోగులు పూర్తి స్థాయిలో నమోదు చేసుకున్నారు. వారి బేసిక్ స్కేల్‌ను అనుసరించి ఎంప్లాయీస్ పెన్షన్ ఫండ్ ఆర్గనైజేషన్ లెక్కలు కట్టి ఉద్యోగులకు చెల్లించే మొత్తాన్ని ప్రకటించనుంది.

జిల్లాలో ఆర్టీసీ డిపోలు

డిపో	డ్రైవర్లు	కండక్టర్లు
ఏలేశ్వరం	87	79
కాకినాడ	303	134
తుని	96	122
కాకినాడ ఆఫీసు	1	2

అప్పట్లో వేధింపులు

టీడీపీ హయాంలో ఆర్టీసీ ఇస్తున్న వేతనాలు చాలక డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర కార్మికులు ఎన్నోసార్లు సమ్మెలు, పోరాటాలు చేశారు. అయినా తగిన ప్రతిఫలం దక్కలేదు. దీనిగాను కార్మికులను వేధించి, సమ్మె కాలానికి జీతాలు కోసి అప్పటి ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఉద్యోగ భద్రత కరువై కార్మికులు రోజులు లెక్కపెట్టుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని ఆర్టీసీ ఉద్యోగులు అంటున్నారు.

ఇప్పుడు ఠంచన్‌గా జీతాలు

కరోనా సమయంలో లాక్‌డౌన్ కారణంగా రెండేళ్లలో సుమారు నాలుగు నెలలకు పైగా బస్సులన్నీ ఆర్టీసీ డిపోలకే పరిమితమయ్యాయి. ఎన్ని కష్టాలు ఉన్నా ఒకటో తేదీన ఉద్యోగులకు ఠంచన్‌గా జీతాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించింది. ఇలా జీతాల చెల్లించడం చరిత్రలో మొదటిసారి అని ఉద్యోగులు ప్రతిసారీ గుర్తు చేసుకుంటున్నారు. సీఎం జగన్ చేసిన మేలును కొనియాడుతున్నారు.

వైఎస్సార్ సీపీని వీడే ప్రసక్తే లేదు

తప్పుడు ప్రచారంపై ఎమ్మెల్యే పెండెం దొరబాబు



పిఠాపురం: తాను పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు ప్రచారాలను పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ సీపీ స్థాపించినప్పుడు ఆ పార్టీలో చేరానని తెలిపారు. వైఎస్సార్ సీపీ ఉన్నంత కాలం అందులోనే కొనసాగుతానని, పార్టీ మారే ఆలోచన ఎప్పుడూ లేదని స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారాలతో తనపై బురద జల్లడానికి కొందరు కుట్ర పన్నారని, అలాంటి వాటిని చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. తన ప్రమేయం లేకుండా తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నాని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఆయన తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి పార్టీలో పని చేస్తున్నానని చెప్పారు. పార్టీ వల్ల, పార్టీ నాయకుల వల్ల తనకు ఎప్పుడూ ఎటువంటి ఇబ్బందీ లేదని అన్నారు. సీఎం వైఎస్ జగన్ సూచనలు పాటించడం తప్ప వేరే ఆలోచనే తనకు రాదని స్పష్టం చేశారు. అటువంటి తనను కావాలని ఇరకాటంలో పెట్టేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, వారిని వదిలిపెట్టేది లేదని పేర్కొన్నారు. ఈ విషయంపై తాను ఇప్పటికే సైబర్ క్రైం పోలీసులను సంప్రదించానని, త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటానని దొరబాబు తెలిపారు.

నిడదవోలు- కొవ్వూరు మధ్య ఆటోమేటిక్ లాకింగ్ సిగ్నల్ సిస్టం

రైల్వే స్టేషన్ (విజయవాడ పశ్చిమ): విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని నిడదవోలు – కొవ్వూరు రైల్వే లైన్‌లో ఆటోమేటిక్ లాకింగ్ సిగ్నల్ సిస్టం ఏర్పాటు చేశారు. విజయవాడ డివిజన్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ మండు రూప్‌కర్ మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. నిడదవోలు – కొవ్వూరు రైల్వే స్టేషన్ల మధ్య 14.82 కిలోమీటర్ల మేర రూ.21.83 కోట్లతో 9 నెలల్లో ఈ ఆటోమేటిక్ లాకింగ్ సిగ్నల్ సిస్టం ఏర్పాటు చేశామన్నారు. విజయవాడ – గన్నవరం, విజయవాడ – కృష్ణా కెనాల్ మధ్య కూడా ఈ సిస్టం ఏర్పాటు పనులు త్వరలోనే పూర్తి కానున్నాయన్నారు. గూడ్స్, ప్యాసింజర్ రైళ్ల రాకపోకలతో ఎప్పుడు రద్దీగా ఉండే ఈ రూట్లలో ఈ విధానం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. దీని ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

వైఎస్సార్ సీపీ పాలనలోనే వైశ్యులకు మేలు



ఆర్య వైశ్యుల సమ్మేళనంలో మాట్లాడుతున్న రాష్ట్ర వైశ్య నాయకుడు శివరామ సుబ్రహ్మణ్యం. చిత్రంలో మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే వరప్రసాదరావు, సంఘ నాయకులు



సమ్మేళనంలో పాల్గొన్న ఆర్య వైశ్యులు

- రాష్ట్ర ఆర్య వైశ్య నాయకుడు శివరామ సుబ్రహ్మణ్యం
- వైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో విశ్వరూప్, వరప్రసాదరావులకు సత్కారం

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే రాష్ట్రంలోని వైశ్యులకు ఎక్కువ మేలు జరిగిందని రాష్ట్ర ఆర్య వైశ్య నాయకుడు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం అన్నారు. అమలాపురంలోని వాసవీ కల్యాణ మంటపంలో మంగళవారం రాత్రి జరిగిన నియోజకవర్గ వైశ్యుల సమ్మేళనంలో శివ రామ సుబ్రహ్మణ్యం అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి పినిపే విశ్వరూప్, రాజోలు ఎమ్మెల్యే, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావుల ప్రత్యేక పరిచయ కార్యక్రమం జరిగింది. విశ్వరూప్, వరప్రసాదరావులు సమ్మేళనంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. శివరామ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వంలో వైశ్యులకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు సీఎం సహాయ నిధి, ఆరోగ్య శ్రీ ద్వారా ఆరోగ్యానికి కూడా శ్రద్ధ తీసుకున్నారని గుర్తు చేశారు. అలాంటి మేలు చేసిన జగన్‌ను, వైశ్యుల ప్రగతి పట్ల ఎప్పుడూ సానుకూల దృక్పథంతో ఉండే విశ్వరూప్, వరప్రసాదరావులను మరోసారి ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యుడు, వైశ్య సంఘం నాయకుడు వంకాయల కాశి అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కంచర్ల గోపి, జిల్లా సంఘం మాజీ అధ్యక్షుడు కొల్లూరి చినబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి నూలు రమేష్, పట్టణ వైశ్య సంఘం అధ్యక్షుడు యెండూరి వెంకట్రామయ్య, యెండూరి నాగేశ్వరరావు తదితరులు ప్రసంగించి మంత్రి విశ్వరూప్ గడచిన అయిదేళ్లలో వైశ్యుల అభ్యున్నతికి చేసిన కృషిని వివరించారు. అనారోగ్యం ఉన్నవారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఇప్పించిన నిధులు గురించి ప్రస్తావించి ఆయన చేసిన మేలును గుర్తు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని తదితరులతో పాటు జిల్లా, నియోజకవర్గ ఆర్య వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు. చివరిగా మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే వరప్రసాదరావులను ఆర్య వైశ్యుల తరపున శివరామ సుబ్రహ్మణ్యం తదితరులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిచి వైశ్యులకు మరిన్ని సేవలు చేస్తారని వైశ్య ప్రముఖులు ఆకాంక్షించారు.

ఎన్నికలకు సహకరించాలి



సమావేశంలో పాల్గొన్న బాలసుబ్రహ్మణ్యం, కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత కోరారు. ఎన్నికల విధి విధానాలపై రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులకు ఎన్నికల సాధారణ వ్యయ పరిశీలకుడు బాలసుబ్రహ్మణ్యం, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ సమక్షంలో కలెక్టరేట్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఖరారయ్యారని, తదుపరి ప్రక్రియ దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. ఏప్రిల్ 25వ తేదీ వరకూ ఉన్న ఓటర్లను అనుసరించి జాబితాను ప్రకటించామన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఒక ప్రతి ఉచితంగా ఇస్తామని, మిగిలిన అభ్యర్థులకు చెల్లింపు ఆధారంగా అందజేస్తామని తెలిపారు. మార్చి 16 నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందని, ఆయా పార్టీల అభ్యర్థుల ఎన్నికల ప్రచార ఖర్చులను పార్టీల ఖాతాలకు చూపామని చెప్పారు. ఏప్రిల్ 18 నుంచి నామినేషన్ల అనంతరం ఖర్చులను ఆయా అభ్యర్థుల ఖాతాలకు చూపామన్నారు. అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని స్పష్టం చేశారు. సువిధ యాప్ ద్వారా ముందస్తుగా అనుమతులు తీసుకున్న తరువాతే సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ జి.నరసింహులు కూడా పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై సెమినార్



సెమినార్‌లో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నాడు నిర్వహించాల్సిన విధులపై సంబంధిత సిబ్బందికి జాంపేట పోలీసు కన్వెన్షన్ హాలులో మంగళవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ, పోలింగ్ రోజున సెక్టార్ పోలీస్ ఆఫీసర్లు, రూట్ మొబైల్, క్విక్ రియాక్షన్ టీముల పాత్ర అత్యంత కీలకమన్నారు. ప్రతి ఓటరూ స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేసే వాతావరణం కల్పించడం పోలీసుల ప్రథమ బాధ్యతని అన్నారు. ఎటువంటి సమస్యలూ తలెత్తకుండా ఎన్నికల విధులు సజావుగా నిర్వర్తించి జిల్లాకు మంచి పేరు తీసుకుని రావాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్ రాజు, జోనల్ డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కొత్త తేరుకు సరికొత్త హంగులు

- సత్యదేవుని ఊరేగింపులో ఇప్పటి వరకూ రావణబ్రహ్మ వాహనమే పెద్దది
- దానికి రెట్టింపు పరిమాణంలో కొత్త రథం
- కల్యాణోత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణ



సత్యదేవుని నూతన పెద్ద టేకు రథం



రథం చక్రాలకు అమర్చిన ఇత్తడి బుష్‌లు. ఈ చక్రాలపై హైడ్రాలిక్ బ్రేకులు ఏర్పాటు చేస్తారు.

అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలు మే 18వ తేదీ నుంచి జరగనున్న విషయం తెలిసిందే. ఈ ఉత్సవాల సందర్భంగా స్వామివారి ఊరేగింపులో ఈసారి సత్యదేవుని నూతన పెద్ద రథం ప్రత్యేక ఆకర్షణగా భక్తులకు కనువిందు చేయనుంది. ఈ పెద్ద రథానికి మరిన్ని హంగులు అద్దుతున్నారు. రూ.1.08 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ భారీ టేకు రథాన్ని దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ ఏప్రిల్ 28న లాంఛనంగా ప్రారంభించిన విషయం విదితమే.


రావణబ్రహ్మను మించి..

సత్యదేవునికి ఉన్న ఊరేగింపు వాహనాల్లో రావణ బ్రహ్మ వాహనమే ఇప్పటి వరకూ అత్యంత పెద్దది. సుమారు 20 అడుగుల ఎత్తు, 15 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పు కలిగిన ఈ వాహనంపై స్వామివారి ఊరేగింపును చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తూంటారు. అయితే రావణబ్రహ్మ వాహనం కన్నా నూతన రథం పొడవు, వెడల్పు, ఎత్తు దాదాపు రెట్టింపు ఉన్నాయి. ఈ రథాన్ని 35.8 అడుగుల ఎత్తు, 14.6 అడుగుల వెడల్పు, 21 అడుగుల పొడవున నిర్మించారు. రథానికి ఉన్న ఆరు చక్రాలను ఆరు అడుగుల ఎత్తున రూపొందించారు. అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ రథం ఎత్తు 38 అడుగులు. దానికంటే సత్యదేవుని రథం ఎత్తు 2.4 అడుగులు మాత్రమే తక్కువగా ఉంది.

హైడ్రాలిక్ బ్రేకులతో..

అంతర్వేది రథంలా సత్యదేవుని రథానికి కూడా ఆకర్షణీయమైన రంగులు వేయనున్నారు. రథం ముందు భాగంలో టేకుతో తయారు చేసిన నాలుగు అడుగుల పొడవు, మూడడుగుల ఎత్తున రెండు గుర్రాలు ఏర్పాటు చేస్తున్నారు. రథానికి ఉన్న ఆరు చక్రాలకు ఇత్తడి ఇరుసులు అమర్చారు. వాటికి పై భాగంలో హైడ్రాలిక్ బ్రేకులు ఏర్పాటు చేస్తున్నారు. అంతే కాకుండా రథం చుట్టూ ఆకర్షణీయంగా అందమైన బొమ్మలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ రథానికి ఇంకా నెల రోజుల పని ఉందని, దీని నిర్మాణ కాంట్రాక్టర్ కొల్లాటి శ్రీనివాస్ తెలిపారు.

కల్యాణోత్సవాలకు రథం సిద్ధం



సత్యదేవుని నూతన పెద్ద టేకు రథాన్ని గత శుక్రవారం లాంఛనంగా ప్రారంభించాం. మిగిలిన పనులు పూర్తి చేసి స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో ఊరేగింపునకు సిద్ధం చేయాలని ఆదేశించాం. – కె.రామచంద్ర మోహన్, కార్యనిర్వహణాధికారి, అన్నవరం దేవస్థానం



అంతర్వేది రథం: దీని మాదిరిగానే సత్యదేవుని రథానికి కూడా రంగులు వేయనున్నారు.

క్లుప్తంగా

అదృశ్యమైన మహిళ మృతదేహం కాలువలో లభ్యం


నాగమణి (ఫైల్)

రావులపాలెం: కుటుంబ గొడవల నేపథ్యంలో ఇంటి నుంచి అదృశ్యమైన మహిళ మృతదేహం కాలువలో లభించినట్టు మంగళవారం పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన కాళ్ళకూరి నాగమణి, నారాయణమూర్తి దంపతులు కుటుంబ గొడవల నేపథ్యంలో సోమవారం తెల్లవారు జామున ఇంటి నుంచి బయటకు వెళ్లిపోగా సాయంత్రానికి నాగమణి తిరిగి రాకపోవడం తెలిసిన విషయమే. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు మంగవారం స్థానిక ముక్తేశ్వరం, అమలాపురం బ్యాంక్ కెనాల్‌లో మందపల్లి వద్ద నాగమణి మృతదేహం లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొత్తపేట ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఎం.ఆంజనేయులు తెలిపారు.

సెబ్ ఆధ్వర్యంలో విస్తృతదాడులు


నిందితుడితో సెబ్ సాత్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ

రాజమహేంద్రవరం రూరల్: డిస్ట్రిక్ట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు మంగళవారం సాత్ స్టేషన్ పరిధిలో విస్తృత దాడులు నిర్వహించారు. రాజానగరం మండలం రాధేయపాలెనకు చెందిన గోసాల ఆనందరావు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి 110 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 1,400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని సాత్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ తెలిపారు. జేగురుపాడులో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న పడగ పోలయ్యను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 180ఎంఎల్ 14 బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

230 లీటర్ల నాటు సారా ధ్వంసం

దేవరపల్లి: దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో వివిధ గ్రామాల్లో పట్టుబడి, సీజ్ చేసిన 230 లీటర్ల నాటుసారా, 106 లీటర్ల మద్యంను అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్, మధ్యవర్తుల సమక్షంలో మంగళవారం స్టేషన్ వద్ద ధ్వంసం చేసినట్టు సీఐ కె.వి.స్వామి తెలిపారు. రెండు ద్విచక్ర వాహనాలను వేలం వేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

కోళ్లుకోవాలంటే..


కోళ్ల ఫారం

- అధిక ఉష్ణోగ్రతలకు ఉత్పాదక, వ్యాధి నిరోధక శక్తి తగ్గుదల
- వ్యాధులు విజృంభించే అవకాశం
- వేసవిలో తగిన జాగ్రత్తలు తప్పనిసరి

రాయవరం: జిల్లాలో వ్యవసాయం తర్వాత కోళ్ల పెంపకం బాగా అభివృద్ధి చెందుతోంది. వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న కోళ్ల పరిశ్రమకు వేసవి నుంచి తగిన రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. వాతావరణంలో వచ్చే మార్పులను తట్టుకోలేక కోళ్ల పరిశ్రమ పలుమార్లు కుదేలవుతూ వస్తుంది. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతలు తట్టుకోలేక కోళ్లు చనిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో కోళ్ల రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే వేసవి నుంచి గట్టెక్కవచ్చు.

వడదెబ్బకు గురైతే

జులై నుంచి అక్టోబర్ వరకు ఎలాంటి వాతావరణ ఒత్తిళ్లు లేకుండా కోళ్లు జీవిస్తాయి. నవంబర్ నుంచి వీచే చలిగాలులకు కొంత ఇబ్బంది ఏర్పడి కోళ్ల జీవన విధానంలో మార్పులు వస్తాయి. అయినా రైతులకు పెద్దగా ఇబ్బంది ఉండదు. మార్చి నుంచి జూన్ వరకు ఉండే వేడి వాతావరణం కోళ్ల పరిశ్రమను ఒక్క కుదుపు కుదుపుతుంది. వాతావరణంలో వస్తున్న మార్పులకు ఏటా ఉష్ణోగ్రతలు పెరుగుతుండడం కోళ్ల రైతులకు అశనిపాతంలా మారుతోంది. ఉష్ణోగ్రత పెరిగినప్పుడు కోళ్లు వడదెబ్బకు గురై 25 నుంచి 90శాతం వరకు చనిపోయే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచే భానుడు భగభగలాడుతున్నాడు. ఎండవేడిమికి పశుపక్ష్యాదులు అల్లాడుతున్నాయి. అందుకే వేడి గాలుల నుంచి కోళ్లను రక్షించుకునేందుకు రైతులు శ్రద్ధ కనబర్చాల్సిన అవసరం ఉంది.

వేసవి ఇబ్బందులు

వేసవికాలంలో బ్రాయిలర్, లేయర్ కోళ్ల పెంపకంలోను ఇబ్బందులు తలెత్తుతాయి. వేసవి తాపం కారణంగా కోళ్లు ఒత్తిడికి, అసౌకర్యానికి గురవుతాయి. కోడి శరీరంలో స్వేద గ్రంధులు ఉండవు. అందువల్ల అది గ్రహించిన వేడిని శ్వాసక్రియ ద్వారా మాత్రమే బయటికి వదలాల్సి వస్తుంది.


కోళ్లఫారాన్ని చల్లగా ఉంచేందుకు పై భాగంలో ఏర్పాటు చేసిన స్ప్రింక్లర్

వేసవిలో కోళ్ల దాణా వినియోగం తగ్గి, నీటి వినియోగం పెరుగుతుంది. ఫలితంగా ఉత్పాదక సామర్థ్యంతో పాటు వ్యాధి నిరోధక శక్తి కూడా తగ్గుతుంది. ఫలితంగా కోళ్లు అతి సులభంగా ప్రాణాంతక వ్యాధులకు గురవుతాయి. బ్రాయిలర్ కోళ్లు చనిపోతే రైతులకు నష్టం వస్తుంది. ఒకవేళ చనిపోయిన ప్పటికీ పెరుగుదల క్షీణించి మాంసం ఉత్పత్తి తగ్గుతుంది. లేయర్ కోళ్లు గుడ్లు చిన్నవిగా పెడతాయి. కొన్ని కోళ్లు అసలు గుడ్లే పెట్టవు. దీంతో ఉత్పత్తి ఖర్చుకు అనుగుణమైన రాబడి రాక రైతుకు నష్టం మిగులుతుంది. ఉష్ణోగ్రతల కారణంగా బ్రాయలర్, లేయర్ కోళ్లలో వ్యాధులు సైతం పెరుగుతాయి. ఫలితంగా ఔషధాలకే ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వస్తుంది. అయినప్పటికీ రెండు కిలోల పైన బరువు ఉన్న కోళ్లు వింత రోగాలతో చనిపోతుంటాయి.


ఫారంలోని కోళ్లు

దీంతో రైతుకు భారీ నష్టం వస్తుంది. లేయర్ కోళ్లకు ఇచ్చిన దాణాకు అనుగుణంగా గుడ్లు పెట్టకపోయినా రైతుకు నష్టం వాటిల్లుతుంది.

తగిన సమయంలో నీరు, దాణా

వేసవిలో సాధారణంగా కోళ్లు తక్కువ మేత తింటాయి. ఉష్ణోగ్రతలు పెరిగే కొద్ది ఎక్కువ నీళ్లు తాగుతాయి. నీరు అధికంగా తీసుకుంటున్న సమయంలో మేత తినాలనే కోరిక ఉండదు. సాధారణంగా వేసవి ఉష్ణోగ్రతలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉంటాయి. దాణాను ఉదయం 10 గంటల ముందు, సాయంత్రం నాలుగు గంటల తర్వాత ఇవ్వాలి. దాణాను ఒకేసారి ఎక్కువ మొత్తంలో ఇవ్వడం మంచిది కాదు. దాణాలో విటమిన్లు, ఖనిజ లవణాలు ఉండేలా చూసుకోవాలి. మాంసకృతులు తగ్గించాలి. ఒత్తిడికి లోనైన కోళ్లకు 'సి' విటమిన్ పెంచాలి. ప్రతీ టన్నుకు 200–300 గ్రాముల 'సి' విటమిన్, 50 గ్రాముల 'ఇ' విటమిన్ కలపాలి. దీనివల్ల గుడ్డు నాణ్యతతో పాటు కోళ్లు ధృఢంగా ఉంటాయి.

అదనంగా నీరివ్వాలి

సాధారణంగా కోళ్ల దాణా, నీరు 1:2 నిష్పత్తిలో ఉండాలి. వేసవిలో కోళ్లు మూడు, నాలుగు రెట్లు అధికంగా నీటిని తీసుకుంటాయి. ఉష్ణోగ్రత అధికమైనప్పుడు దాణా, నీటి నిష్పత్తి 1:4 గా ఉండడం అవసరం. వీలైనంత వరకు చల్లని నీటిని మాత్రమే కోళ్లకు అందుబాటులో ఉంచాలి. ఎలక్ట్రోలైట్లను కలిపి ఇవ్వడం ద్వారా డీహైడ్రేషన్ సమస్యను నివారించవచ్చు. నీటి ద్వారా సంక్రమించే రోగాలను నియంత్రించడానికి ఎప్పటికప్పుడు కోళ్లకు ఇచ్చే నీటిని శుభ్రపర్చాలి. సాధారణంగా కోళ్ల ఫారాలలో నీటిని నిల్వ చేసేందుకు వాటర్ ట్యాంకులను ఉపయోగిస్తారు. వేసవిలో నీళ్ల ట్యాంకులు వేడెక్కకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

వేడి గాలుల నుంచి రక్షణ ఇలా పొందాలి..

కోళ్లకు వడదెబ్బ తగలకుండా ఉండాలంటే షెడ్ల మీద గడ్డి, తాటాకు లేదా కొబ్బరి ఆకులు కప్పాలి. దీనివల్ల షెడ్లలో ఉష్ణోగ్రత మూడు నుంచి ఐదు డిగ్రీలు తగ్గుతుంది. కోళ్ల ఫారంలోకి గాలి ధారాళంగా ప్రసరించేలా చూడాలి. అవసరమైతే ఫ్యాన్లు ఏర్పాటు చేసుకోవాలి. షెడ్డు పైభాగంలో స్ప్రింకర్లు ఏర్పాటు చేసుకోవాలి. ఫారం చుట్టూ నీడనిచ్చే చెట్లను పెంచడం మంచిది. షెడ్డు లోపల కోళ్లు కిక్కిరిసి ఉండకుండా, లోపలి వైశాల్యానికి తగిన సంఖ్యలో కోళ్లు ఉండేలా చూసుకోవాలి. కోళ్లు వడదెబ్బకు గురైతే తల మునగకుండా మిగిలిన శరీరాన్ని చల్లని నీటిలో ఉంచాలి. దీనివలన కోడి శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరుతుంది.

వడదెబ్బ ప్రారంభమైంది

పౌల్ట్రీ యజమానులు నష్టాలకు గురవుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలతో కోళ్లకు వడదెబ్బ తగలడం ప్రారంభమైంది. ఫలితంగా అధిక సంఖ్యలో కోళ్లు చనిపోతున్నాయి. ముఖ్యంగా యంగ్ లేయర్స్ చనిపోతున్నాయి. గుడ్ల ఉత్పత్తి కూడా దారుణంగా పడిపోయింది. ఏటా వేసవిలో కోళ్ల రైతులు నష్టాలను ఎదుర్కొంటున్నారు.

– కర్రి రామారెడ్డి, పౌల్ట్రీ యజమాని, రాయవరం

టైమ్ టేబుల్ ప్రకారం టీకాలివ్వాలి

కాలానుగుణంగా టీకాలు ఇవ్వడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి కోళ్లకు ఉంటుంది. రైతులు వేసవిలో కోళ్ల యాజమాన్యం విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలి. నిర్లక్ష్యం వహిస్తే మరణాల సంఖ్య పెరగడం, గుడ్లు, మాంసం ఉత్పాదకత తగ్గడం వలన రైతులకు నష్టాలు సంభవించే అవకాశముంది.

– డాక్టర్ కర్నీడి మూర్తి, డిప్యూటీ డైరెక్టర్, పశు సంవర్ధక శాఖ, అమలాపురం

కోళ్లకు సోకే వ్యాధులు

కొక్కెర

వేసవిలో కోళ్లకు వచ్చే భయంకరమైన వ్యాధి కొక్కెర తెగులు. ఈ వ్యాధి సోకితే పెద్ద సంఖ్యలో కోళ్లు చనిపోతాయి. వయసుతో నిమిత్తం లేకుండా కోళ్లకు ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. వ్యాధి సోకిన కోళ్లు ముడుచుకుని, రెక్కలను వేలాడేస్తాయి. పక్షవాత లక్షణాలు కలిగి, తెలుపు, ఆకు పచ్చ రంగులో విరేచనాలు అవుతాయి. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడతాయి. కోడి శరీరంలోని కొన్ని భాగాల్లో సన్నని రక్తపు చుక్కలు కన్పిస్తాయి. కొక్కెర వ్యాధి నివారణకు మందులు లేవు. అయితే ముందుగానే నివారణ టీకాలు వేయించాలి.

గంభోరా

రెండు నెలల వయసు లోపు బ్రాయలర్ కోడి పిల్లలు గంభోరా వ్యాధికి గురయ్యే అవకాశాలు ఎక్కువ. ఈ వ్యాధి సోకిన కోడి పిల్లల్లో 10 నుంచి 20 శాతం మరణాలు సంభవిస్తాయి. నీళ్ల విరేచనాలతో కోడి పిల్లలు నిలబడలేక వణుకుతూ ఉంటాయి. వ్యాధి సోకిన కోడి పిల్లలను వెంటనే ఇతర కోళ్ల నుంచి వేరు చేయాలి. నీటిలో యాంటీ బయాటిక్స్ విటమిన్లు కలిపి ఇస్తే కొంతవరకు ఉపశమనం కలుగుతుంది. గంభోరా వ్యాధి నివారణకు కోడి పిల్లకు 10 నుంచి 14 రోజుల వయసులో టీకాలు వేయించాలి.

టకోరైజా

ఈ వ్యాధి సోకిన కోడి పిల్లలు మేత, నీటిని సరిగ్గా తీసుకోలేక బరువు తగ్గిపోతాయి. ముక్కు, కళ్లు ఉబ్బి తెల్లటి చీము గడ్డల మాదిరిగా తయారవుతాయి. వ్యాధికారక క్రిములు ఒకసారి కోళ్లఫారం షెడ్డులో ప్రవేశిస్తే అన్ని బ్యాచ్‌లకు వ్యాధి సోకుతుంది. కోడి పిల్లలకు వారం రోజుల పాటు యాంటీ బయాటిక్స్ విటమిన్లు అందిస్తే వ్యాధి పూర్తిగా నయమవుతుంది. వ్యాధి సోకినప్పుడు షెడ్డును కొంతకాలం ఖాళీగా ఉంచాలి. పశువైద్యుల సలహా మేరకు యాజమాన్య చర్యలు చేపట్టాలి.

ఇంద్రపాలెంలో దారుణ హత్య

కొడుకు వేధింపులు తాళలేక రాడ్డుతో కొట్టి చంపిన తండ్రి

కాకినాడ రూరల్: ఇంద్రపాలెంలో దారుణం చోటు చేసుకుంది. చేతికి అందివచ్చిన కొడుకును తండ్రే కడతేర్చాడు. విషాదం నింపిన ఈ ఘటనకు సంబంధించి ఇంద్రపాలెం పోలీసులు వివరాలు ఇలా ఉన్నాయి. డ్రైవర్‌గా పనిచేస్తున్న యువకుడు గుడాల అరవింద్ సూర్య(26) హత్యకు గురయ్యాడు. సోమవారం అర్ధ రాత్రి సమయంలో కొడుకును తండ్రి వెంకటరమణ రాడ్డుతో కొట్టి చంపాడు. ఇంద్రపాలెం వివేకానంద స్కూల్ ప్రాంతంలో నివాసం ఉంటున్న వెంకటరమణ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య వెంకటలక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం జరిగింది. విడాకులవ్వడంతో ఆమె పుట్టింటి వద్దే ఉంటోంది. డ్రైవర్‌గా కుటుంబాన్ని నెట్టుకువస్తున్న వెంకటరమణ కొడుకు అరవింద్ సూర్య కూడా డ్రైవర్‌గానే పనిచేస్తున్నాడు. అందివచ్చిన కొడుకు ఆసరాగా ఉంటాడని భావిస్తే చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. తరచూ మద్యం సేవించి తల్లిదండ్రులతో ఘర్షణ పడేవాడు. డబ్బులు ఇవ్వాలని వేధించేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి మద్యం సేవించి వచ్చిన అరవింద్‌సూర్య.. తండ్రితో గొడవ పడ్డాడు. తనకు రూ.3 లక్షలు కావాలని వేధించడంతో తండ్రీకొడుకుల మధ్య గొడవ జరిగింది. కొడుకు ప్రవర్తనతో విసుగు చెందిన వెంకటరమణ చాలాసేపు మౌనంగా ఉన్నప్పటికి జీర్ణించుకోలేకపోయాడు. కుమార్తె కాపురం చెడిపోయి ఇంటి వద్ద ఉండడంతో తమ జీవనం అంతంత మాత్రంగా ఉంది. అండగా ఉండవలసిన కొడుకు ఇలా వేధిస్తుండడంతో కఠిన నిర్ణయం తీసుకుని, అర్ధరాత్రి సమయంలో వేరే గదిలో నిద్రిస్తున్న కొడుకు తలపై రాడ్డుతో కొట్టి హత్య చేశాడు. మంగళవారం ఉదయమే సమాచారమందుకున్న ఇంద్రపాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. రూరల్ సీఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తల్లి వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మణికుమార్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించామన్నారు.


అరవింద్ సూర్య (ఫైల్)

గోదావరిలోకి దూకిన విద్యార్థి

రక్షించిన మత్స్యకారులు

మామిడికుదురు: పాశర్లపూడి వైనతేయ గోదావరి నదిపై నుంచి పెదపట్నం గ్రామానికి చెందిన బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థిని మంగళవారం గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పంది. స్థానిక మత్స్యకారులు ఆమెను రక్షించి, సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న నగరం ఎస్సై పి.సురేష్, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న విద్యార్థిని కుటుంబ సభ్యులు పోలీసుల సహకారంతో ఆమెను చికిత్స నిమిత్తం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తీసుకు వెళ్లారు. దీనికి సంబంధించిన కారణాలపై ఎస్సై విచారణ చేస్తున్నారు.

భార్యతో గొడవపడి చేయి కోసుకున్న భర్త

కరప: భార్యతో గొడవపడి చేయి కోసుకుని ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నాడు. ఈ ఘటన కరప మండలం వేళంగిలో జరిగింది. స్థానికులు, కరప పోలీసులు తెలిపిన వివరాల మేరకు..... కరప మండలం వేములవాడ గ్రామానికి చెందిన కర్రెడ్ల వీరవెంకట సుబ్రహ్మణ్యం మూడేళ్ల క్రితం వేళంగి గ్రామానికి చెందిన వీరలక్ష్మితో వివాహమైంది. వీరికి ఏడాదిన్నర వయసున్న పాప కూడా ఉంది. గ్రామ వలంటీర్‌గా పనిచేసి మానేసిన సుబ్రహ్మణ్యం ఏడాది క్రితం భార్యను వదిలేసి జులాయిగా తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం వేళంగిలోని అత్తవారింటికెళ్లిన సుబ్రహ్మణ్యం తన కుమార్తెను ఇచ్చేయాలంటూ భార్య వీరలక్ష్మితో గొడవ పడ్డాడు. దానికి అంగీకరించకపోవడంతో బ్లేడ్‌తో చేయి కోసుకుని ఆత్మహత్య చేసుకోవడానికి యత్నించాడు. దీంతో కుటుంబసభ్యులు వెంటనే వేళంగి పీహెచ్‌సీకి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తుని: స్థానిక జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధిలో తుని–హంసవరం మధ్యలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. మంగళవారం అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుని మండలం హంసవరం యార్డులో గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి(35) ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి ఒంటిపై సర్ఫ్‌రంగు నెక్ టీషర్ట్, నీలం, తెలుపు, సిమెంట్ రంగు లుంగీ ధరించి ఉన్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

వైఎస్సార్ సీపీకి ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు ఉసిరిపాటి బ్రహ్మయ్య

కాకినాడ రూరల్: రాష్ట్రంలో మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సంపూర్ణ మద్దతును ఇస్తుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు ఉసిరిపాటి బ్రహ్మయ్య పేర్కొన్నారు. కాకినాడ రమణయ్యపేట వైద్యనగర్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ గెలుపు పేద వర్గాల గెలుపుగా భావించి రాష్ట్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, మైనార్టీ వర్గాలు వైఎస్సార్ సీపీని గెలిపించాలని పిలుపు ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో పెత్తందారులు, పెట్టుబడి వర్గాలకు వ్యతిరేకంగా పేద వర్గాల అభ్యున్నతి కోసం జగన్ కృషి చేశారన్నారు. దాదాపు 30 ఏళ్లుగా సీఎంలను చూస్తున్నామని, ఈ ఐదేళ్లలో నా వల్ల మంచి జరిగితే ఓటు వేయమని కోరుతున్న దమ్మున్న నాయకుడు జగన్ అన్నారు. రాష్ట్రంలో పేదల కుటుంబాలకు మంచి జరిగిందన్నారు. జగన్‌ను గెలిపించాలనడానికి కారణం ఆయన మాట ఇస్తే నిలబడే వ్యక్తి అన్నారు. ఆయన మాట తప్పరన్నారు. మిగిలిన నాయకులు మాట తప్పారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వర్గీకరణ చేపడతామని బీజేపీ మాట్లాడి, అధికారంలోకి వచ్చిన పదేళ్లు గడుస్తున్నా.. పార్లమెంట్‌లో ప్రస్తావించకుండా మభ్యపెడుతోందన్నారు. పదేళ్ళ కాలంలో అనేక బిల్లులు ప్రవేశపెట్టుకుని వర్గీకరణకు చట్టం చేయకుండా సుప్రీంకోర్టుకు తోసేసిందన్నారు. 2014లో డబ్బుకొట్టి, చెప్పుకుట్టి నేనే పెద్ద మాదిగ అవుతానని మాట్లాడిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత ఆంధ్రప్రదేశ్‌లో మాదిగలు మీటింగ్‌లు పెట్టుకోకుండా అడ్డుకోవడమే కాకుండా కేసులు పెట్టి జైలుకు పంపారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మంద కృష్ణ ఎన్‌డీఏ గెలుపు మాదిగల గెలుపు అని, చంద్రబాబు గెలుపు మాదిగల గెలుపు అని మభ్య పెడుతున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణకు కేంద్రంపై యుద్ధమే అని చెప్పిన మంద కృష్ణ ఈ రోజు ఎందుకు బీజేపీ, నరేంద్రమోదీ కౌగిలిలోకి దూరారో చెప్పాలన్నారు. ఆరోజు చంద్రబాబు మోసగాడని చెప్పిన మంద కృష్ణ ఇప్పుడు ఆయనకు వత్తాసు పలుకుతున్నారన్నారు. చంద్రబాబు, ఎన్డీఏ గెలుపు మాదిగల గెలుపు కాదన్నారు. జగన్ గెలిపించుకునేందుకు అందరూ కృషి చేయాలని, కాకినాడ జిల్లాలో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థులు కన్నబాబు, గీత తదితరులను గెలుపించుకోవాలన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనరు కొల్లూరి నాని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ము చినబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందిక చక్రం, సవరపు నాగరాజు, కొమ్మురి గరటయ్య, బీఎస్ సుధాకర్, పలివెల విజయ్‌కుమార్, ఇప్పర్తి రత్న కుమార్ పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బ్రహ్మయ్య

ఎన్నికల్లో అక్రమ రవాణాపై నిఘా విస్తృతం

నగదు సీజ్...మద్యం స్వాధీనం

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ రవాణాను అడ్డుకునేందుకు జిల్లా పోలీసు శాఖ నిఘాను మరింత విస్తృతం చేసింది. ఎస్ఈబీ, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ నిఘా బృందాలు నిరంతరం తనిఖీలు, దాడులు చేస్తూనే ఉన్నాయి. జిల్లాలో సోమ, మంగళవారల్లో నిర్వహించిన దాడులు, తనిఖీల్లో పట్టుబడ్డ నగదు, మద్యం వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం ఓ ప్రకటనలో వివరించింది.

- జిల్లాలో సోమవారం ఒక్క రోజులోనే నిఘా బృందాలు దాడులు, తనిఖీలు చేసి రూ.7,11,67,452 విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు సీజ్ చేయడంపై ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆ బృందాల అధికారులను అభినందించారు. ఈ సొత్తును వాహనాల్లో తరలిస్తున్న వ్యక్తులు నిఘా అధికారులకు సరైన పత్రాలు, ఆధారాలు చూపించని కారణంగా సీజ్ చేసినట్టు ఎస్పీ శ్రీధర్ తెలిపారు.
- జిల్లాలో 13 కేసులను నమోదు చేసి 15 మంది నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 83 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 101 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 38.48 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్ స్వాధీనం చేసుకున్నారు.
- మండపేట మండలం జెడ్.మేడపాడు వద్ద గల చెక్ పోస్ట్ వద్ద నిఘా బృందాలు వాహనాలను తనిఖీ చేసి రూ.1,62,310 నగదు సీజ్ చేశారు.
- జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ మలికిపురం, మామిడికుదురు మండలాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను కొత్తపేట డీఎస్పీ రమణ, రాజోలు సీఐతో కలసి తనిఖీ చేశారు. మరింత బందోబస్తుపై ఆయా మండల పోలీసు అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు.
- మండపేట అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, పోలీసు అధికారులతో పోలీసు అబ్జర్వర్ ఎంవీ చంద్రకాంత్ పరిస్థితులపై సమీక్షించారు. అనంతరం ఆ నియోజకవర్గంలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను చంద్రకాంత్ తనిఖీ చేశారు.
- ద్రాక్షారామ పోలీసు స్టేషన్ పరిధిలో నెలపర్తిపాడు, మామిడిగుంట గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ప్రాంతాల్లో స్థానిక పోలీసు అధికారులు కేంద్ర బలగాలతో మంగళవారం సాయంత్రం కవాతు నిర్వహించారు.


కరవాకలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ శ్రీధర్, కొత్తపేట డీఎస్పీ రమణ


'నన్నయ'లో అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఆందోళన

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నూతనంగా చేపట్టదలచిన ఆటోమేషన్ ప్రక్రియలో భాగంగా అధిక వేతనంతో కాంట్రాక్ట్ సిబ్బందిని నియమించడం దుమారాన్ని లేపింది. చాలీచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్న తమ వేతనాలు పెంచకుండా, బయట నుంచి అధిక వేతనంతో కొత్తవారిని తీసుకోవడం ఏమిటని యూనివర్సిటీలోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం ఆందోళనకు దిగారు. మధ్యాహ్నం నుంచి చేపట్టిన వారి ఆందోళన రాత్రి వరకు కొనసాగింది. చివరకు వీసీ ఆచార్య కె.పద్మరాజు వారిని చర్చలకు పిలిచి, ఆందోళనను విరమించే ప్రయత్నం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. యూనివర్సిటీలోని వివిధ విభాగాలలో ఆటోమేషన్ విధానాన్ని అమలు చేయాలని వీసీ ఆచార్య పద్మరాజు భావించారు. ఇందుకు గాను నెలకు రూ. 35 వేలు వేతనంతో ఒకరిని తీసుకున్నారు. ప్రస్తుతం పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఒక్కొక్కరికీ నెలకు రూ.18,500 వరకు వేతనం చెల్లిస్తున్నారు. దీనిపై వీసీ ఆచార్య పద్మరాజును వివరణ కోరగా వికాస్ సంస్థ నుంచి ఒకరిని తీసుకున్న మాట వాస్తవమేనన్నారు. వివిధ విభాగాలలో ఆటోమేషన్ విధానాన్ని అమలు చేసేందుకు నలుగురు ఉద్యోగులు అవసరమని, ఆరు నెలల కాలవ్యవధితో ప్రస్తుతం ఒకరి మాత్రమే తీసుకున్నామన్నారు. ఆ ఒక్కరు కూడా ప్రస్తుతం యూనివర్సిటీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులలో ఒకరన్నారు. వారికి పూర్తి అవగాహన కలిగించి, ఆందోళనను విరమించే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

వ్యభిచారం గుట్టు రట్టు

రామచంద్రపురం: పట్టణంలోని చోడవరం బైపాస్ రోడ్డులో గల ఒక ల్యాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు చేసి నలుగురిని అరెస్టు చేసినట్లు రామచంద్రపురం ఎస్సై కె.సురేష్‌బాబు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎస్పీ బి.రామకృష్ణ సీఐ పి.దొరరాజు సూచనలతో చోడవరం వై.జంక్షన్‌లో గల ఆర్ఆర్ గ్రాండ్ లాడ్జిపై దాడులు చేయగా ముగ్గురు విటులు, నిర్వాహకుడిని, ఇద్దరు మహిళలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని ఎస్సై తెలిపారు. లాడ్జి నిర్వాహకుడిపైనా, ముగ్గురు విటులపైనా కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. మహిళలకు కౌన్సెలింగ్‌ను నిర్వహించి బంధువులకు అప్పగించామని తెలిపారు. లాడ్జిలలో అసాంఘిక కార్యక్రమాలను నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అవయవ దానం


రామకృష్ణారావు (ఫైల్)

కాకినాడ రూరల్: మండలంలోని కొవ్వాడకు చెందిన నాగడమూడి రామకృష్ణారావు(56) అవయవాలను కుటుంబ సభ్యులు మంగళవారం దానం చేశారు. రామకృష్ణారావు ట్రస్ట్ ఆస్పత్రిలో సోమవారం బ్రెయిన్ డెడ్ అవ్వడంతో కుటుంబ సభ్యులు అనుమతితో జీవన్ దాన్‌కు అవయవాలు దానం చేశారు. లివర్‌ను ట్రస్ట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న పేషెంట్‌కు, నేత్రాలను బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు అందించారు. రామకృష్ణారావుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య పదేళ్ల క్రితం మృతి చెందింది. కుమారుడు సాయి సూర్య హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కుమార్తె శ్రీసత్యకు ఇటీవల వివాహమైంది. బియ్యం వ్యాపారం చేసుకుంటూ జీవనోపాధి పొందే రామకృష్ణారావు మృతి బాధాకరమని ఆయన అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను ట్రస్ట్ ఆస్పత్రి వైద్యుడు, డైరెక్టర్ రామకృష్ణ అభినందించారు.